క్లుప్తంగా

త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలి



ఫిరంగిపురం: జగనన్న గృహనిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని ఫిరంగిపురం, 113 త్యాళ్లూరు, తక్కెళ్లపాడు గ్రామాల లేఅవుట్లలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం సిమెంటు, ఇసుక, ఇనుము అందజేస్తున్నట్లు వివరించారు. అంతేకాక డ్వాక్రా ద్వారా రుణాలు ఇస్తున్నారని వాటిని వినియోగించుకొని నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రహ్మానందపురానికి ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో బుధవారం కార్పొరేషన్ అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. నులకపేట పంప్‌హౌస్ నుంచి గ్రామానికి వెళ్లే పైప్‌లైన్ పగిలిపోవడంతో ఆ పైపులను రిపేర్ చేసే నిమిత్తం పంప్‌హౌస్ నుంచి సరఫరా నిలిపివేశారు. సచివాలయ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కోరడంతో కార్పొరేషన్ డీఈ నాలుగు ట్యాంకర్ల ద్వారా ప్రతి ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు ఫరీనాబేగం అన్నారు. మండలంలోని బేతపూడిలో బుధవారం వైఎస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్యపరీక్షలు చేశారు. అందులో 70 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాల, ఎంపీపీ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. వర్షంలో తడవకుండా ఉండాలని చెప్పారు. సాధ్యమైనంత వరకు వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు.

మిర్చి పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడిలో బుధవారం మిర్చి పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పంట పొలాలకు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉపసంచాలకుడు పి.రామాంజనేయులు మాట్లాడుతూ మిర్చి పంటకు బొబ్బర తెగులు ప్రధాన సమస్యగా మారిందని చెప్పారు. ఇది తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుందని దీనిని నివారించినట్లయితే తెగులు నివారణ సాధ్యమన్నారు. దీని కోసం ఎకరాకు 20 నుంచి 30 వరకు పసుపు రంగు జిగురు అట్టలు అమర్చడం అలాగే వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో లాం శాస్త్రవేత్త ఫణికుమార్, ఏఓ వాసంతి, కేంద్ర వనరుల వ్యవసాయ శాఖాధికారి రాజవంశీ పాల్గొన్నారు.

విల్హెల్మ్ రోంట్జెన్ సేవలు మరవరానివి

తెనాలిఅర్బన్: విల్హెల్మ్ రోంట్జెన్ సేవలు మరువరానివని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలోని ఎక్స్‌రే విభాగంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే పితామహుడు విల్హెల్మ్ రోంట్జెన్ చిత్రపటానికి బుధవారం ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1895 నవంబర్ 8న ఆయన ఎక్స్‌రే కనుగొన్నట్లు చెప్పారు. 1901లో నోబెల్ ప్రైజ్‌ను ఆయన అందుకున్నారని తెలిపారు. నవీన్, జానీబాషా, జయకర్, గుంటూరు రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులపై కేసులు

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. తెనాలి మండలంలోని కొలకలూరు వంతెన వద్ద హాఫ్‌పేట గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న నలుగురిని రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్‌ఐ హెచ్చరించారు.

నగర అభివృద్ధిలో ప్రణాళికా విభాగం పాత్ర కీలకం

కమిషనర్ నిర్మల్ కుమార్



ప్రణాళికా విభాగం దినోత్సవంలో ప్రసంగిస్తున్న కమిషనర్ నిర్మల్ కుమార్

మంగళగిరి: నగర అభివృద్ధిలో ప్రణాళికా విభాగం పాత్ర ఎంతో కీలకమని, నగర అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికా ఎప్పటికపుడు మార్పులు చేసుకుంటూ ముందుకు సాగాలని కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రణాళికా విభాగం దినోత్సవం బుధవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌కు ఆదాయ వనరుగానే గాక ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఇంజినీర్లు, ప్లానింగ్ సెక్రటరీలు ఎంతో జాగ్రత్తగా ప్రజలకు అవసరమైన నిర్మాణాల కోసం అనుమతులు చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వ స్థలాలతో పాటు రోడ్ల ఆక్రమణలు జరక్కుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డీ మధు కుమార్, డీసీపీ కె.అశోక్‌కుమార్, స్కూలు ఆఫ్ లెర్నింగ్ ప్రొఫెసర్ నాగరాజు, ఏడీ రవికుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’తో మెరుగైన వైద్యం



వల్లభాపురం సచివాలయం 2 పరిధిలో దీర్ఘకాలిక రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

వల్లభాపురం(కొల్లిపర): గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటివద్దనే రోగులకు, దీర్ఘకాలిక రోగులకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు, మందులు అందిస్తున్నామని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలో సచివాలయం -2 పరిధిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 163 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, అంగన్ వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు మరియు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు వలన తేలికపాటి వర్షాలు, చలి పెరగటం జరుగుతుందని దీనిద్వారా శ్వాసకోశ పరమైన వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోరువెచ్చని తాగునీరు సేవించాలని సూచించారు. 104 సిబ్బంది బొమ్ము కోటిరెడ్డి, సూపర్‌వైజర్ సాయిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమలేశ్వరరావు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎమ్ పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించండి



బంద్ సందర్భంగా విద్యార్థులకు బయటకు పంపిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించండంతో పాటు కడప ఉక్కు కర్మాగార నిర్మాణాలను వెంటనే జరపాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యాసంస్థల బంద్‌ను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పట్టణంలో పర్యటిస్తూ విద్యాసంస్థలను మూయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పారిశ్రామిక వేత్తలకు కేంద్ర ప్రభుత్వం అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. లాభాల్లో ఉన్న ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం చూడటం బాధకరమన్నారు. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అలాగే కడప స్టీల్ ఫ్యాక్టరీ వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్ది కిరణ్‌బాబు, నాయకులు చెన్నూరి సాయి, గుండు శివ, కుంభ రవితేజ, బిళ్ళ రాజేష్, అన్నం హేమచరణ్, కావేటి యశ్వంత్, కుప్పల కృష్ణ, పాశం వినయ్, కుర్రా పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దారుఢ్యం

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి. వెంకటేశ్వరరావు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో

గుంటూరు ఎడ్యుకేషన్: అగ్ర భారత్ నిర్మాణంలో పాలు పంచుకునే విద్యార్థినీ, విద్యార్థులు శారీరక, మానసిక దృఢంగా ఉండాలని, అందుకు విద్యార్థి దశలో క్రీడలు ప్రధాన పాత్ర పోషిస్తాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియంలో బుధవారం కన్నా విద్యాసంస్థల క్రీడోత్సవాన్ని నిర్వహించారు. క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్‌డీవో జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఊపి క్రీడల్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నాయని చెప్పారు. ఇటీవల కౌలాలంపూర్ లో జరిగిన ఆసియా క్రీడల పోటీల్లో భారతదేశ క్రీడాకారులు గణనీయ స్థాయిలో పతకాలు సాధించారని తెలిపారు. వచ్చే ప్రతిష్టాత్మక ప్రపంచ ఒలింపిక్స్ భారతదేశంలో ఘనంగా నిర్వహించేందుకు భారత ప్రధాని తమ సంసిద్ధతను వ్యక్తం చేశారని తెలియజేశారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ తమ పాఠశాలలో నాలుగు దశాబ్దాలుగా ఉన్నతమైన విద్యాబోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. 50, 100, 150, 200 మీటర్ల పరుగు పందెలతో పాటు షటిల్, బాస్కెట్ బాల్, వాలీబాల్, హై జంప్, లాంగ్ జంప్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా, క్రీడా స్ఫూర్తితో పాల్గొంటున్నట్లు ఆయన వివరించారు.

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనుల్ని పూర్తి చేయండి

అధికారులకు నగర మేయర్ కావటి సూచన



18వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, జాప్యం జరగకుండా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్‌లోని రామనామ క్షేత్రం నుంచి అచ్చయ్య దాబా సెంటర్ వరకు రూ.80 లక్షలతో నగరపాలక సంస్థ నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్లు, రోడ్డు నిర్మాణ పనుల్ని బుధవారం మేయర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోపు నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు తూర్పు,పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో రూ. 450 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనుల్ని కుల, మత, పార్టీలకతీతంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పనులు జరిగేప్రాంతాల్లో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడకుండా ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యటనలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, డీఈఈ రమేష్ బాబు, ఏఈ రాంబాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ మారణకాండ దారుణం



మాట్లాడుతున్న విద్యావేత్త సింగరయ్య

లక్ష్మీపురం: గాజాపై ఇజ్రాయెల్ మారణకాండ దారుణమని అవగాహన సంస్థ సభ్యులు, విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య ఖండించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే కాల్పుల విరమణ, స్వతంత్ర పాలస్తీనా వంటి నినాదాలు అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి పశ్చిమ దేశాల సహ ప్రపంచవ్యాప్తంగా హోరెత్తుతున్నాయని తెలిపారు. ఆ సంఘీభావ ఉద్యమంలో భారతీయులమంతా భాగస్వాములు అవుదామని పిలుపునిచ్చారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎన్.జి.రంగాకు ఘన నివాళి

సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్.జి. రంగా కడిగిన ముత్యంలా నిలిచారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. కార్యాలయంలో బుధవారం ఎన్.జి. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లెకుపోదాం



దేవరపల్లి వీరయ్య

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమం దుగ్గిరాల మండలంలో గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ దేవరపల్లి వీరయ్య బుధవారం తెలిపారు. మొదటి విడతగా పల్లెకుపోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాల్లో ప్రజలకు చేసిన మేలు గురించి వివరించడంతో పాటు ఆ యా గ్రామాల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్లకార్డుల రూపంలో వివరించనున్నట్లు చెప్పారు. వై నీడ్స్ జగన్ ఏపీ అనే ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దుగ్గిరాలలో మొదటి విడతగా 9వ తేదీన చింతలపూడి, 10న తుమ్మపూడి, 14న కంఠంరాజు కొండూరు, 15న పెనుమూలి, 16న రేవేంద్రపాడు, 17న శృంగారపురం, 20న పేరుకలపూడి, 21న పెదపాలెం, 22వ తేదీ ఈమని-1, 23వతేదీ పెదకొండూరు గ్రామాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు.

రెండు బైక్‌ల అపహరణ

చేబ్రోలు: మండలంలో బైక్ దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ఒకే ప్రాంతంలో మంగళవారం రాత్రి రెండు బైక్‌లు అపహరణకు గురవ్వడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలు నుంచి వడ్లమూడి వెళ్లే రహదారిలో వాటర్ ట్యాంక్ ప్రాంతంలో నివసిస్తున్న నాగిశెట్టి ఉదయకుమార్ రాత్రి ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేశారు. ఉదయం లేచి చూసేసరికి మాయమైంది. ఇదే ప్రాంతంలో ఎన్. సురేష్‌బాబుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించుకు పోయారు. ఇద్దరు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతరెడ్డిపాలెం ప్రాంతంలో కూడా మరో బైక్ మాయమైనట్లు తెలిసింది.

అడ్డూ అదుపులేని బైక్ చోరీలు

కొద్ది రోజుల కిందట నారాకోడూరు పాత కెనరా బ్యాంక్ ప్రాంతంలో సాయంత్రం సమయంలో షాపు ముందు ఉంచిన కొత్త బైక్‌ను దొంగలు మాయం చేశారు. నాలుగు రోజుల కిందట సుద్దపల్లిలో ఇంటి ముందు ఉంచిన మైలా చింతయ్యకు చెందిన బైక్ చోరీకి గురైంది. గత నెల రోజుల్లో మండలంలోని గ్రామాల్లో 20 వరకు బైక్‌లు దొంగతనానికి గురైనట్లు సమాచారం. పోలీసుల కళ్లు గప్పి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు.

వ్యక్తి అదృశ్యం



ప్రత్తిపాడు: కంపెనీ క్వార్టర్స్ నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం, పొట్లపాడుకు చెందిన జవ్వాది నరేంద్రబాబు రెండు సంవత్సరాలుగా ప్రత్తిపాడు మండలం నడింపాలెంలోని ఆది శివం యార్న్ టెక్స్‌టైల్స్ కంపెనీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అక్కడే కంపెనీ క్వార్టర్స్‌లో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో గత నెల 15న భార్యాపిల్లలను అత్తింట్లో వదిలిపెట్టాడు. అప్పటి నుంచి కంపెనీ క్వార్టర్స్‌లో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. అదే నెల 21వ తేదీ సాయంత్రం బయటికి వెళ్లి నేటి వరకు తిరిగిరాలేదు. నాటి నుండి ఇప్పటి వరకు వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో, బుధవారం తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో మేలు



వైద్యసేవలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ నిర్మల్ కుమార్

మంగళగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష దేశంలోనే చారిత్రాత్మకంగా అని కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. బుధవారం నగర పరిధిలోని కాజ సచివాలయంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, మందుల పంపిణీ తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు ఇంటి వద్దనే అన్ని రకాల వైద్యసేవలందించి మందులివ్వడంతో ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్షను అపూర్వంగా ఆదరిస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్షకు వచ్చిన ఆదరణతో పథకం నిర్విరామంగా ప్రజలకు సేవలందించేలా రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, వైద్యులు శ్రీమన్నారాయణ, అర్బన్ హెల్త్ సెంటర్‌ల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అనూష, సత్యవతి, టి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



మాట్లాడుతున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమాన్ని గురువారం నుంచి నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు. గురువారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇప్పటికే 95 శాతం నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ఎన్నికలకు వెళుతున్నారని చెప్పారు. ప్రజలు ఆశీర్వదించి 175/175 సీట్లలో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారనేందుకు గ్రామాల్లో తమకు వస్తున్న ఆదరణే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, మన్నవ రాజేష్, అబ్బాస్, వెంకటరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నేడు దామరపల్లిలో..

తాడికొండ మండలం దామరపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

ఎయిమ్స్‌లో సర్వర్ మొరాయింపు

రోగుల ఇక్కట్లు

మంగళగిరి: స్థానిక ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో సర్వర్ మొరాయించింది. బుధవారం ఆస్పత్రికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో రోగులు చేరుకున్నారు. తొలుత నంబర్ తీసుకుంటే త్వరితగతిన వైద్యం చేయించుకోవచ్చని తెల్లవారుజామునే చేరుకున్న రోగులకు సర్వర్ పని చేయడం లేదని ఓపీ నంబర్ కేటాయించలేమని సిబ్బంది చెప్పారు. షుగర్, బీపీ, రక్త పరీక్షలకు ఏమి తినకుండా వచ్చిన రోగులు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వచ్చింది. రోగులు ఎంత ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారులు, వైద్యులు కనీసం స్పందించలేదు. మధ్యాహ్నం వరకు గంటల తరబడి వేచిఉన్న రోగులు ఇక సహించలేక ఆసుపత్రి అధికారులు, వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుతిరిగారు. ప్రధానంగా ఎయిమ్స్‌లో అధికారులు, వైద్యులు నిర్లక్ష్యంతో ఇక్కట్లు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్‌లలో తలెత్తిన సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో కూడా చెప్పలేని స్థితిలో ఎయిమ్స్ సిబ్బంది ఉన్నారు. సర్వర్ల నిర్వాహకంపై వివరణ అడిగేందుకు ఎంత ప్రయత్నించినా ఫోన్లు కూడా ఎత్తడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

శలపాడులో 559 మందికి కళ్లజోళ్లు పంపిణీ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



మహిళకు కళ్లజోడు అందజేస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: మండలంలోని శలపాడులో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంధత్వ సమస్య నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్ర జ్యోతి పేరుతో వైద్య శిబిరాల్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత నేత్ర వైద్య శిబిరాల అనంతరం వైద్యసేవల్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. శలపాడులో 613 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా, సమస్య ఉన్న వారందరికీ వారం రోజుల్లోనే 559 మందికి కళ్లజోళ్లను అందించినట్లు చెప్పారు. వివిధ గ్రామాల్లో నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభిస్తోందని తెలిపారు. అనంతరం శలపాడు గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు చెబుతూ, జగనన్న చిత్రపటాలను ప్రదర్శించారు.

శాస్త్రీయ దృక్పథంపై దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు



సైంటిఫిక్ టెంపర్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 28వ తేదీ వరకు దేశవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాల్ని చేపడుతున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం సైంటిఫిక్ టెంపర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ ఫర్ నెట్‌వర్క్, అనుబంధ సంస్థ, ప్రజా సైన్స్ ఉద్యమ సంస్థ జనవిజ్ఞానవేదిక, ఇతర రాష్ట్రాల్లోని 40 సైన్స్ సంస్థలను కలుపుకుని దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్తలు సీవీ రామన్, మేడమ్ క్యూరీ జయంతి సందర్భంగా ఈనెల ఏడో తేదీన ప్రారంభించి, ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం వరకు దేశ వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా గ్రామ, పట్టణాలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మూఢ నమ్మకాలతో పాటు, సూడో సైన్స్ నిరోధించేందుకు శాస్త్రీయ దృక్పథ ప్రచార కార్యక్రమాల్ని ముమ్మరంగా నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నామని చెప్పారు. జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు మాట్లాడుతూ సైన్స్ ఫర్ డెమోక్రసీ, సైన్స్ ఫర్ సెక్యులరిజం పేరుతో ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని, సృజనాత్మకశక్తిని పెంపొందింపచేయడమే సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఎం. కళాధర్, బి. ఆదిలక్ష్మి, ఎండీ షకీలాబేగం, జి. వెంకట్రావు, ఎస్.ఎం. సుభాని, సయ్యద్ గయాసుద్దీలా పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

పెదనందిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ కె.వి.ఎల్.ఎన్. మూర్తి తెలిపారు. పెదనందిపాడు మండలంలో బుధవారం సిబ్బంది 2,658 సర్వీసుల్ని తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి సంబంధించి రెండు కేసులు నమోదు చేసి రూ.1,50,000, అదనపు లోడ్ కింద 121 సర్వీసులకు రూ.7,04,000, మాల్ ప్రాక్టీస్ కింద ఒక కేసుకు రూ. 5,000 జరిమానా విధించినట్లు ఈఈ కె.వి.ఎల్.ఎన్. మూర్తి తెలిపారు. మొత్తం 8,89,000 అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో బాపట్ల విద్యుత్ ఈఈ జి. ఆంజనేయులు, డెప్యూటీ ఈఈలు పి.వి.ఆర్. మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించండి: ఎంఈఓ మేకల



తెనాలిఅర్బన్: ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల విద్యాధికారి-1 మేకల లక్ష్మీనారాయణ సూచించారు. ప్రైమరీ పాఠశాలలో వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైమరీ పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తరచు తనిఖీలు చేయాలని సూచించారు. అలాగే స్కూల్ రికార్డులను కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ-2 వి.జయంతిబాబు, పలువురు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.